

# అరుణసంధ్య

పి. సత్యవతి

తెల్లని దూదిపింజ మబ్బులు అరుణిమలో కరిగిపోవడం, పడమటి ఆకాశమంతా గాయపడిన హృదయంలా అయిపోవడం, ఆపైన చీకటి ముసురుకు రావడం, చూస్తూ కూర్చుంది అరుంధతి- అంతలోనే కరిగిపోయిన అన్ని రంగుల్ని చూసి ఆశ్చర్య పడింది.

అక్కడ జరుగుతున్న చర్చ ఆమె చెవిన పడు తూనే ఉంది. ఎవరి అభిప్రాయాలు వాళ్లు ఖచ్చితంగా చెప్పడానికి వెనుకాడడం లేదు. అరుంధతిని ఎవరూ ఆమె అభిప్రాయం అడగలేదు.

అడిగితే ఏం వుంది చెప్పడానికి?

"మన పెద్దవాళ్లు అమెరికాలో ఇమడలేరు- ఆ జీవితం వేరు- అక్కడ మీకేం తోచదు- మీరు ఇక్కడ వుంటేనే సుఖంగా వుంటుంది," అన్నాడు రవి.

"అమ్మ చాలా అలసిపోయింది- కొన్నాళ్లు తీసుకువెళ్లి నా దగ్గర వుంచుకుందాం అనుకున్నాను," అన్నది కరుణ.

"పిచ్చిగా మాట్లాడకు. ఈ వయస్సులో వాళ్లిద్దరూ ఒకచోటే వుండడం ధర్మం. ఇక్కడాయన ఒక్కడే ఎలా వుంటాడు- వేళకి మందు, సరి అయిన భోజనం, ఇదంతా ఎవరు చూస్తారు? తీసుకువెళితే ఇద్దర్నీ తీసుకువెళ్లు- కొంచెం పెద్దిల్లు తీసుకో! ఈ ఇల్లు అద్దె కిచ్చెయ్," అన్నాడు రవి.

"నా కష్టార్జితంతో ఇల్లు కట్టుకున్నాను. నేనిక్కడే వుంటాను. నేనెవరింట్లోనూ వుండను- వుంటే కొడుకు దగ్గర వుండాలి లేకపోతే నా ఇంట్లో వుండాలి- నేను కరుణ దగ్గరుండడం ఏమిటీ?" అని కోపంగా అరిచి నంత పనిచేసేడు సూర్యనారాయణ.

"అదేమిటండీ కరుణ మీ కూతురు కాదా? రవి ఎంతో కరుణ అంత కాదా మీకు?" అన్నాడు మోహన్.

"అవన్నీ తీసిపడెయ్యవోయ్- వున్న ధర్మం చెప్పాను నేను. నా తల్లితండ్రుల్ని వృద్ధాప్యంలో నా దగ్గరుంచుకున్నాను- మా ఆవిడ వాళ్లకి సేవ చేసింది. అది ధర్మం. ఇప్పుడు నాకొక ఇల్లుంది- కనుక నా ఇంట్లో నేను వుంటాను. కూతురు దగ్గర వుండడం ధర్మం కాదు," అన్నాడు సూర్యనారాయణ.

అరుంధతికి నవ్వొచ్చింది, 'ధర్మపన్నాలు చెబు తున్నాడు సూర్యనారాయణ,' అనుకుని. లత అరుం ధతివైపు చూస్తోంది- పెదవి విప్పి ఒక్కమాట మాట్లాడని ఆ ఇల్లాలిని చూసి ఆశ్చర్యపడింది. రవిని పెళ్లి చేసు కున్నాక వచ్చి ఇక్కడ వుండడం యిదే ప్రథమం. అరుంధతి గురించిగానీ సూర్యనారాయణ గురించిగానీ రవి ఆమెతో ఎక్కువ ఏం చెప్పలేదు. ఈ పదిరోజుల నుంచీ ఆమె అరుంధతిని చాలా నిశితంగా పరిశీలి స్తోంది.

"మామగార్ని కూడా తీసుకుపోదాం కరుణా!" అన్నాడు మోహన్.

"నేను రానని ఇందాకే చెప్పాను. ఎవరి పంచలో వుండవలసిన అవసరం నాకు లేదు," అన్నాడు సూర్య నారాయణ చిరాకుపడిపోయి.

"నువ్వు మాట్లాడవేం అమ్మా!" అన్నాడు రవి కొంచెం అసహనంగా.

"నాకు మాట్లాడ్డానికేం లేదు," అంది అరుంధతి, చాలా నిర్లిప్తంగా.

"ఆవిడ తరఫున కూతుర్ని పెట్టుకుందిగా! ఇంక మాట్లాడే అవసరం ఏముందీ! చేసేదంతా చేసి ఏమీ ఎరగనట్టు కూర్చుంటుంది!" అంటున్నాడు సూర్య నారాయణ.

"ఇందులో అమ్మ ప్రమేయం ఏం లేదు నాన్నా నేనే అన్నాను," అంది కరుణ.

"ఆవిడ ప్రమేయం ఎందులోనూ వుండదు. తమాషా చూస్తూ కూర్చుంటుంది. 'ఈ వయస్సులో మీ నాన్నా నేను ఒకచోటే వుండాలి మేం ఇక్కడే వుంటాం,' అని అనవచ్చుగదా! అనదు. నా కుటుంబం కోసం నేనెంత కష్టపడ్డానో నాకే తెలుసు- ఒక్క రెక్క మీద మీ అందర్నీ ఇంత వాళ్లని చేశాను. ఎవరికీ కృతజ్ఞత లేదు," సూర్యనారాయణ.

అరుంధతి లేచి వంటగదిలోకి వచ్చింది. అలాగే వాదించుకోనీ! తనకేం! తను తీసుకునే నిర్ణయమేదో తీసేసుకుంది. జీవితంలో తనంతట తాను తీసుకున్న మొదటి నిర్ణయం. బహుశా చివరిది కూడా! భోజనాల వేళ వరకూ వాదోపవాదాలు, ప్రణాళికలు, అంచనాలు జరుగుతూనే వున్నాయి. భోజనల దగ్గర కూరలో ఉప్పు ఎక్కువైందని పెద్ద యుద్ధం లేవదీశాడు సూర్య నారాయణ. ఆ కోపం అంతా అరుంధతి తనని సమర్థిస్తూ మాట్లాడలేదనే విషయం లతకి కూడా అర్థం అయింది.

"ఇన్ని ఐటమ్స్ వున్నాయిగదా! ఆ కూర వదిలేసి తినండి," అంది లత అసహనంగా.

"జీవితం అంతా ఈవిడతో ఇలానే సరిపెట్టు కుంటూ బ్రతికానమ్మా," అన్నాడాయన.

తనంత నోరు పారేసుకుంటున్నా అరుంధతి పెదవి విప్పలేదు.

"మీ అమ్మ చాలా చిత్రమైన మనిషి- చాలా డిటాచ్డ్‌గా వున్నట్లుంటుంది- అసలీ ఇంటికి చెంద నట్లు ఎక్కడినించో వచ్చి పదిరోజులు మీకు సాయం చేసి వెళ్లడానికి వుంటున్నట్లు వుంటుంది," అంది లత, వారంరోజుల నాడు రవితో.

"ఆవిడంతే- ఎప్పుడు ఏమీ పట్టించుకోదు. దేని మీదా శ్రద్ధ కూడా లేదు- తన ఆరోగ్యం గురించే లేదు- ఏదైనా వచ్చినప్పుడు ఆయన చేత చివాట్లు తిని డాక్టర్ దగ్గరకు పరిగెత్తుతుంది," అన్నాడు రవి.

ఆ సమాధానం ఏమాత్రం నచ్చలేదు లతకి. తను యు.ఎస్. నుంచి వస్తూ అత్తగారికోసం చాలా వస్తువులు తెచ్చింది. పగడాలనీ, ముత్యాలనీ, నాన్‌స్టిక్ వంటపాత్ర లనీ, డిన్నర్ సెట్- అవ్వన్నీ చూసినప్పుడు కూడా ఆవిడ మొహం మీద రవంత సంతోషం కనపడలేదు.

'ఈ పగడాలు, ముత్యాలూ వేసుకుని, ఈ నాన్ స్టిక్ పెనాల మీద నాజూకు దోసెలు పోసుకుంటూ, అతిథులకి అమెరికా డిన్నర్‌సెట్‌లో అన్నం వడ్డిస్తూ ఇంకా ఎన్నాళ్లు? సూర్యనారాయణ భార్యకి!' అను కుంది అరుంధతి అని లతకి తెలియదు.

ఉండడానికో ఇల్లుండి, వున్న పిల్లలిద్దరూ చక్కగా స్థిరపడి, వాళ్లకి నచ్చిన జీవన భాగస్వాముల్ని ఎంచుకుని పెళ్లి చేసుకుంటే, ఈ వయస్సులో ఎంత గర్వంగా, ఎంత దర్జాగా ఎంత ఆనందంగా వుండాలి ఈ తల్లి!

లతకి అమ్మ గుర్తొచ్చింది- ఆవిడ చేసే ఆర్భాటం గుర్తొచ్చింది- 'మా అమ్మాయి అమెరికా నుంచీ యివ్వన్నీ తెచ్చింది,' అంటూ పడే ఆనందం గుర్తొ చ్చింది. యాభై దాటినా ఇంకా చక్కగా ముస్తాబై పోయి, హుషారుగా కబుర్లు చెబుతూ, ఎంత పని చేస్తూ వుంటుందో ఆవిడ! వాళ్లిద్దరికీ అడుగడుగునా కనిపించే తేడా పదిరోజులుగా అర్థం చేసుకోవడానికి ప్రయత్ని స్తోంది లత.

అన్నయ్య ఢిల్లీలో వుంటాడు. తన దగ్గరకు రమ్మంటే నాన్న కన్న ముందు అమ్మే చెబుతుంది- "మేం రాముర అబ్బాయ్- ఇది మా ఇల్లు- ఇక్కడ మేం హాయిగా వుంటాం- ఇష్టమొచ్చింది వండు కుంటాం- హాయిగా ఇంటినిండా పుస్తకాలు పేపర్లు విరజిమ్ముకుంటాం. కావాలంటే శుభ్రంచేసుకుంటాం- లేదంటే లేదు. మా సామ్రాజ్యం యిది. దీనికి నేను రాణీని- మీ ఇంటికి మీ ఆవిడ రాణి- తెలిసిందా!" అంటుంది.

ఈవిడ, ఈ అరుంధతి మొహంలో ప్రకాశం లేశం కూడా చూడలేదు తను! రవితో, తనతో కరుణతో కబుర్లు చెబుతూ, తమని గౌరవిస్తూ, ప్రేమిస్తూ వుండే సూర్యనారాయణ అరుంధతిని ఎంత చీదరించు కుంటాడో, ఎంత తిరస్కారంగా సమాధానాలు చెబుతాడో లత పదిరోజులుగా గమనించింది.

ఆ ఇంట్లో ఏ నిర్ణయం తీసుకున్నా అది ఏకపక్ష నిర్ణయమే- అధికారాలన్నీ సూర్యనారాయణవే- అంతిమ నిర్ణయాలన్నీ అతనివే.

ముప్ఫై సంవత్సరాల దాంపత్య జీవనం ఆ ఇద్దరి మధ్యా ఏ అనుబంధాన్నీ చివురింపచేయలేదంటే లతకి ఆశ్చర్యంగా వుంది. సూర్యనారాయణ కొడుకు రవి,

తనకి జలుబు చేసినా మంచం మీద నుంచి లేవ నివ్వడు- కాఫీ తెచ్చి చేతికిస్తాడు. అటువంటి రవి తల్లి దగ్గర కూర్చుని ఆవిడతో ఒక గంటన్నా మాట్లాడినట్లు లేదు. తనయితే అలా ఉండలేదు. రెండేళ్ల తరువాత ఇంటికి వస్తే అమ్మతో నాన్నతో చెప్పడానికి ఎన్ని కబుర్లుంటాయో- వాళ్లల్లో ఏమేం మార్పులొచ్చాయో, ఎంత చిక్కిపోయారో, అన్నీ పరిశీలిస్తుంది. ముందు అమ్మకి దగ్గరగా కూర్చుంటుంది. భుజం మీద చెయ్యి వేస్తుంది, ఆ స్పర్శ చాలు! కానీ రవి అసలు వాళ్లమ్మని ఒక్కసారి కూడా ముట్టుకోలేదు. కనీసం ఆవిడ కూరగాయలు కోసుకుంటుంటే దగ్గర కూర్చుని కబుర్లయినా చెప్పడు.

'ఆవిడెప్పుడు అంతే,' అంటాడు. ప్రతీదానికి అతనికి తండ్రి మీద అభిమానం. ఇద్దరూ వరండాలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటారు. తనని మంచి స్కూళ్లల్లో చేర్చి చదువు చెప్పించాడు. అమెరికా పంపించాడు. అడిగినంత డబ్బు లేదనకుండా యిచ్చాడు. లతని పెళ్లి చేసుకుంటానంటే సమ్మతించాడు. కట్నం వద్దన్నాడు. 'పైకి అలా వుంటాడుగానీ మా నాన్న చాలా మంచివాడు.' అంటాడు.

కరుణకి కూడా తండ్రి మీద ఎలాంటి కంప్లయింట్స్ లేవు. రవితో సమంగా చదువు చెప్పించాడు. ఆడపిల్ల అని తేడా చూపించలేదు. మోహన్‌ని పెళ్లి చేసుకుంటానంటే సరేనన్నాడు.

"ఇంత మంచివాడు, ఆవిణ్ణెందుకులా వేపుకు తింటాడు?" అంది లత.

"ఎందుకో వాళ్లిద్దరికీ పడదు- మొదటినించీ అంతే. ఆవిడెప్పుడు దిగులుగా ఏదో పారేసుకున్నట్లు వుంటుంది. హుషారుగా వుండదు. అయినా మాకే లోపం చెయ్యలేదు- మమ్మల్ని బాగా పెంచింది," అంటుంది కరుణ.

వాళ్లిద్దరికీ తండ్రి మంచివాడే.

కరుణ తల్లిని కనిపెట్టి వుంటుంది. వెంట వెంట తిరుగుతూ వుంటుంది.

"నేను వెళ్లిపోతే అమ్మకి ఏమీ తోచదు," అని కళ్లనీళ్లు పెట్టుకుంది. అమ్మా నాన్న తనతో వుంటే బావుండునంటుంది.

అరుంధతి ఏమీ అనదు.

అంటే ఎక్కడ వున్నా ఒకటేననా? ఎలాగైనా బ్రతకవచ్చుననా?

భోజనాలయినాక అరుంధతి సూర్యనారాయణకి వరండాలో మంచం వేసింది. నవ్వారు అల్లిక పట్టె మంచం. బరువైనది. ఆవిడ మోసుకొస్తుంటే మోహన్ అందుకుని వరండాలో వేసేడు.

"రోజూ ఇక్కడే పడుకుంటావుగదా! ఈ మంచం ఇక్కడే వుండనివ్వకూడదూ!" అన్నాడు రవి.

"నవారు మాసిపోతుంది- పైగా వరండాలో ఎదురుగా మంచం ఏమిటీ!" అన్నాడు సూర్యనారాయణ.

మంచం మీద మెత్తటి పరుపూ, ఇస్త్రీ దుప్పటీ వేసింది. రెండు తలగడలు పెట్టింది. మంచం ప్రక్కన ముక్కాలిపీట మీద మంచినీళ్ల కూజా పెట్టి, దాని మీద గ్లాసు బోర్లించింది. అతను రోజూ వేసుకునే నిద్రమాత్ర స్ట్రిప్ నుంచి తీసి చేతిలో పెట్టి, గ్లాసులోకి నీళ్లు వొంపి యిచ్చింది.

'దొరకునా ఇటువంటి సేవా!'

అరుంధతి చిన్నగా నవ్వుకుని లోపలికి వచ్చింది-

'అరుంధతి తనని విడిచిపెట్టి ఎక్కడికి వెడుతుంది!' అనుకుని హాయిగా నిద్రలోకి జారేడు సూర్యనారాయణ. అవును- అరుంధతి ఎక్కడికి వెడుతుంది!

ఏం! అరుంధతి ఎందుకు వెళ్లదు? వెడుతుంది! ఇప్పుడే- ఇవాళే!

కొంతసేపు కబుర్లు చెప్పుకుని యువజంటలు ఎవరి గదిలోకి వారు వెళ్లి నిద్రపోతారు.

తనూ నిద్రపోతుంది. సుఖనిద్ర- జీవితానికంతటికీ ఒకే ఒక సుఖనిద్ర- అంతా లక్షణంగా జరిగిపోతుంది- ఎవరికీ ఏ కష్టమూ వుండదు- ఎవరూ ఎక్కడ నుంచీ శ్రమపడి రానక్కర్లేదు.

జీవితంలో అనేకసార్లు తల ఎత్తి, నిర్దాక్షిణ్యంగా అణచి వేయబడ్డ కోర్కె ఇప్పుడు తీరుతుంది- అరుంధతి ఎక్కడ వుండాలి అనే చర్చ ఇక వుండదు. అరుంధతి ఎక్కడ వుండాలో కనీసం యిప్పుడు అరుంధతే నిర్ణయిస్తుంది.

అరుంధతి గదిలోకి వచ్చి, కిటికీ తలుపులు తీసింది- చల్లనిగాలి శరీరాన్ని తాకింది. శరీరమే కదా యిప్పుడున్నది- ఇదే కదా ఇప్పుడు భారమైపోయింది. లైటు వేసి గోడకి వున్న పెళ్లి ఫోటో చూసింది. ముప్పై ఏళ్లనాటి మాసిపోయిన ఫోటో అయినా అందులో దేదీప్యమానంగా వెలిగిపోతున్న తన మొహం, బరువైన పూలదండలో నుంచి. చందమామలా వుంది- స్వచ్ఛంగా తళతళలాడే కళ్లు- ముప్పై సంవత్సరాల చరిత్రలో మర్చిపోలేనివీ చిరకాలం గుర్తుపెట్టుకోదగ్గ మధురానుభవాలేం వున్నాయి!

మధురానుభవాలా?

అనుభవాలున్నాయి! ఎందుకిప్పుడు తలుచుకోవడం? పెళ్లి ఫోటో ప్రక్కనున్న దేవుడి పటానికి నమస్కారం చేసింది.

పరుపు క్రింద పెట్టిన బీరువా తాళంచెవుల కోసం చూసింది. లేవు. కంగారుగా నాలుగు మూలలా వెతికింది. లేవు. పరుపు ఎత్తి నేలమీద పడేసి దుప్పటి దులిపింది. లేవు- ఆఖరికి ఇప్పుడు కూడా! దేవుడికి కూడా తను సుఖపడ్డం యిష్టం లేదన్నమాట! వీల్లేదు. తాళం చెవులు వెతికి పట్టుకోవాలి- ఈ తాళం చెవులు సూర్యనారాయణకి అక్కర్లేదు. తన బీరువాలో తన చీరెలు తప్ప ఏంలేవు- డబ్బు, డాక్యుమెంట్లు, వెండీ బంగారం అతని బీరువాలోనే వుంటాయి. అయోమయం, తెలివితక్కువ, దేబెమొహం, పరాకు మొదలైన గుణాలన్నీ పుణికి పుచ్చుకున్న అరుంధతి ఆధీనంలో వుండవు.

దొరకలేదు తాళంచెవులు-

అసలు సాయంత్రం వరకూ బొడ్లోనే దోపుకుని తిరిగింది వాటిని. సాయంత్రం స్నానానికి వెడుతూ పరుపు క్రింద పడేసింది.

రేపు సాయంత్రం కరుణ ప్రయాణం- రవికింకా పదిహేను రోజులుంది- ఎవరూ యిబ్బంది పడకూడదు. ఇప్పుడు లైట్లు వేసి ఇల్లంతా వెతికితే అందరూ లేస్తారు. ఫరవాలేదు- ఏదో ఒకటి చెప్పవచ్చు. కానీ తాళం చెవులు కనిపించి తీరాలి.

ఎవరో తలుపు కొడుతున్నారు. ఎవరో! తియ్యక పోతే ఇంకా ఇంకా కొడతారు-

కళ్లు తుడుచుకుని, మొహానికి పట్టిన చమట తుడుచుకుని తలుపు తీస్తే ఎదురుగా తాళం చెవుల గుత్తితో లత! పాలిపోయిన మొహంతో నిలబడింది అరుంధతి.

''తాళం చెవులిస్తాను గానీ నిద్రమాత్రల సీసా యివ్వను- ఒక మాత్ర కావాలంటే యిస్తాను,'' అంది, పిసరైనా సానుభూతి లేని గొంతుతో.

అరుంధతి మాట్లాడలేదు.

''ఇలాంటి పిరికివాళ్లంటే నాకిష్టం వుండదు. మీ ఆలోచనలన్నీ నేను కనిపెడుతూనే వున్నాను. అసలెందుకు ఇలా హఠాత్తుగా వెళ్లిపోదలచుకున్నారు!'' నిలదీసి అడుగుతోంది.

హఠాత్తుగానా! ఇప్పుడే వచ్చిందా ఈ ఆలోచన?! కాదు. ఇరవై ఎనిమిదేళ్లనాడు, ప్రక్కింట్లో చదువుకునే విద్యార్థి మంచినీళ్లు అడిగితే, యిచ్చినప్పుడు, సూర్యనారాయణ తనకీ ఆ విద్యార్థికీ మధ్య అక్రమ సంబంధం వుందని అర్థంలేకుండా మాట్లాడినప్పుడు, తనని చెంపదెబ్బ కొట్టినప్పుడు అప్పుడు రాలేదూ ఈ ఆలోచన!!

వచ్చింది- కానీ అప్పుడు కడుపులో రవి- ఇంకో పదిరోజులకో ఏమో భూమి మీదకి రాబోతున్న రవి. పోనీలే! వీళ్లందరికీ మంచినీళ్లివ్వకపోతేనేం! కిటికీ తలుపులు మూసేస్తే పోతుంది!

అప్పుడేమిటీ, ఇంకా చాలాసార్లు వచ్చింది.

మరిగే కాఫీ నెత్తి మీద పోసినా, తినే అన్నం మొహానికి పులిమినా, పుట్టింటికి వెళ్లి పదిరోజులుండి వస్తే, పగిలిపోయిన గాజులు, ఎండినపూలు, ఖాళీ కండోమ్ పాకెట్‌లు ఊడ్చేసుకుని, పరుపులు ఎండేసుకుని ఇల్లు డెట్టాల్‌తో కడుక్కుని, మళ్లీ సుఖంగా కాపురం చేసుకునేప్పుడు- చాలాసార్లు వచ్చింది ఈ ఆలోచన. ఎప్పుడు ఈ ఆలోచన వచ్చినా బిక్కు బిక్కుమంటూ కొంగు పట్టుకు తిరిగే పిల్లలు, సవతితల్లి పెట్టే బాధలు, తల్లి పోయిన దుఃఖంలో పాడైపోయే భవిష్యత్తు- ఆడదానికి ఎన్నున్నాయో చావనీయకుండా బంధించే పరిస్థితులు! 'వుంటే వుండు పోతే పో. నా యిష్టం,' అనే పాలసీని సూర్యనారాయణ అప్పటికీ ఇప్పటికీ పాటిస్తూనే వున్నాడు. పోతే పోవడానికి కనపడని సంకెళ్లెన్నో- వుంటే వుండడమే మిగిలింది. ఇప్పుడు పిల్లలు బిక్కుబిక్కుమనరు. కళకళలాడుతున్నారు. కాళ్ల మీద నిలబడ్డారు- సంకెళ్లు తెగిపోయాయి.

ప్రేమ సంబంధాలుంటే బ్రతకాలి- అధికార సంబంధాలు, సంప్రదాయాలు, ధర్మాలతో తనకేం పని! తనకొక్కదానికేనా ధర్మాలు!

అవమానాలు, ఛీత్కారాలతో సాగిన దాంపత్య జీవితాన్ని తలచుకుని తలచుకుని మురిసిపోవడానికి సాగించాలా ఈ బ్రతుకు! అతను మంచి తండ్రి కావచ్చు- మంచి భర్త కాడని ఎరగరా వీళ్లు!

వీళ్ల తీర్పులు, ఓదార్పులు తనకెందుకు! వచ్చిన పని అయిపోయింది. ఎవరికీ అపకారం చెయ్యలేదు- ఎవరినీ నష్టపరచలేదు. కన్నీళ్లు కార్చినా, దుఃఖంతో అవమానంతో వేగిపోయినా, ఎవరి ముందూ ఆ బాధని వెళ్లగక్కలేదు. ఎవరి మనశ్శాంతీ భగ్నపరచలేదు. తనలో తనే కాలిపోయింది. తన బ్రతుకు మీద నిర్ణయం ఇప్పుడు కూడా ఎవరికీ వదలదు. ఏం చదవాలో, నాన్న

నిర్ణయించేడు. ఏ బట్టలు కట్టుకోవాలో, ఎలా మాట్లా డాలో, ఎవర్ని పెళ్లాడాలో అన్నీ సమాజము, నాన్న నిర్ణ యించేరు. ఏం వండాలో, ఏం తినాలో, ఎప్పుడు నవ్వాలో, ఎందుకు నవ్వకూడదో, ఎలా బ్రతకాలో సూర్యనారాయణ నిర్ణయించేడు. ఎక్కడ వుండాలో, ఎందుకుండాలో, ఏది ధర్మమో ఇప్పుడు పిల్లలు నిర్ణయిస్తున్నారు.

''భేష్!'' అరుంధతి కళ్లు అగ్నిగోళాల్లా వున్నాయి. అవమాన జ్వలిత ద్వేషాగ్ని జ్వాలలు ఎగజిమ్ము తున్నాయి.

కరిగిన కుంకుమ అంతటా పులుముకున్న ఆమె ముఖం అస్తమయ సూర్యబింబంలా వుంది.

ఎర్రచీరె ధరించిన అరుంధతి మండుతున్న మంచి గంధం చెట్టులా వుంది.

లతకి తన తల్లి గుర్తొచ్చింది. వెన్నెలలు విరజిమ్మే పున్నమి జాబిల్లిలా వుంటుంది. ఆవిడకి జీవితం అంటే అపారమైన ప్రేమ. అందుకు కారణం అర్థం అయింది లతకి. గదిలో ఘనీభవించిన నిశ్శబ్దం.

ఎవరూ పెదవి విప్పడం లేదు. చాలాసేపటి తరు వాత కిటికీ దగ్గరకు వచ్చింది లత! దూరంగా తెల్ల వారుతున్న వెలుగు.

నెమ్మదిగా అరుంధతిని సమీపించి, ఆమెని దగ్గర గా పొదువుకుంది. సంవత్సరాలుగా గడ్డకట్టిపోయిన దుఃఖం ఆ వెచ్చనిస్పర్శతో కరిగి కన్నీరు వరద అయింది.

*ఆహ్వానం మాసపత్రిక, ఆగస్ట్ 1994*

